ప్రజాశక్తి



బుధవారం 19 ఫిబ్రవరి 2025 | 5 | విజయనగరం

వందశాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఉల్లాస్

వయోజన విద్య ఉప సంచాలకులు సోమేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం చేపట్టామని వయోజన విద్య ఉప సంచాలకులు అల్లు సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం విజయనగరం, పూసపాటిరేగ మండలాల్లో ఉల్లాస్ ప్రోగ్రామ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉల్లాస్ ప్రోగ్రాం ద్వారా 48578 మంది పొదుపు సంఘాల మహిళలు, అంగన్వాడీ ఆయాలు, మధ్యాహ్న బోజన పథకం కార్మికులను గుర్తించామన్నారు. వారిలో అక్షరాస్యతను పెంచేందుకు 4857 మంది వాలంటీర్లు నియమించామన్నారు. ఆర్థికంగా జరుగుతున్న మోసాలు, డిజిటల్ అక్షరాస్యత గురించి రూపొందించిన వీడియోలను చూపిస్తూ వివరించారు. కార్యక్రమంలో ఎం ఎల్ ఓ హరీష్, ఈశ్వరరావు, వాలంటీర్ మేరి కుమారి పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

●దూసుకుపోతున్న విజయగౌరి ● మద్దతుగా పిడిఎఫ్ తాజా, మాజీ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు మరో 8రోజులు మాత్రమే గడువు ఉండడంతో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికకు సమయం సమీపిస్తుండడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేపడుతూనే, మరోవైపు ఉపాధ్యాయుల ఇళ్లకూ వెళ్లి ప్రచారం చేస్తుండడం గమనార్హం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీ యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, పాకలపాటి రఘువర్మ(ఎపిటిఎఫ్), గాదె శ్రీనివాసులు నాయుడు (పిఆర్‌టియు) మధ్యే పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పనితీరును, గతంలో ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు పనిచేసిన గాదె శ్రీనివాసుల నాయుడు పనితీరును అంచనా వేసుకున్న ఉపాధ్యాయులు ఈసారి కోరెడ్ల విజయగౌరి వైపు మొగ్గు చూపుతున్నారు. అంపశయ్య మీద ఉన్న విద్యారంగాన్ని కాపాడుకునే యత్నంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పలు జిఒల రద్దుకు పోరాటం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం ప్రభుత్వాన్ని కదిలించేలా చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు భావిస్తున్నాయి.

యుటిఎఫ్ బలపర్చిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యలపై అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. ఐటిడిఎల పరిధిలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు చేపట్టిన పోరాటాలకు అండగా ఉండడంతో పాటు ధర్నాలు, నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఆమెకు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే విజయగౌరి ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలలను, కళాశాలలను పలు దఫాలుగా సందర్శించి తనను గెలిపించాలని ఉపాధ్యాయులను, అధ్యాపకులను కోరారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో ప్రచారం నిర్వహించారు.



శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న కె.విజయగౌరి

ఎమ్మెల్సీ బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీపడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థుల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు. ఆమె విజయంతోనే తమ సమస్యలు పరిష్కారం కావచ్చనే అంచనాలో ఉపాధ్యాయులు ఉన్నారు.

తాజా, మాజీ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నాయకుల ప్రచారం

మరోవైపు విజయగౌరి గెలుపు కోసం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మంగళవారం మన్యం జిల్లాలో ప్రచారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం విజయనగరం జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పచారం చేపట్టారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించి శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించేందుకు విజయగౌరిని గెలిపించాలని కోరారు. యుటిఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఉత్తరాంధ్ర నుంచి శాసనమండలికి తొలిసారి మహిళా అభ్యర్థిగా పోటీలో ఉన్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

అవకాశమిస్తే మీ గళమవుతా : విజయగౌరి

శ్రీకాకుళం : ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట, ఆముదాలవలస మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, పరిణామాలను వివరించి తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల విధులు నిర్వహించేటప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పిఒలు, ఎపిఒలు, జోనల్ అధికారులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులను ఎన్నిసార్లు నిర్వహించినప్పటికీ, ఏమాత్రం అలసత్వం చూపించ కూడదని అన్నారు. ఎప్పటికప్పుడు నిబంధనలు మారుతూ ఉంటాయని, కొత్త ఆదేశాలు వస్తుంటాయని, వాటన్నిటినీ చదివి అర్థం చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఎన్నికలకు, ఇవిఎంల ద్వారా జరిగే ఎన్నికలకు మధ్య కొన్ని తేడాలు ఉంటాయని, వీటిని ప్రతీ ఒక్కరూ గ్రహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తీసుకొనే దగ్గరనుంచి, ఓటింగ్ పూర్తిచేసి తిరిగి అప్పగించే వరకూ పాటించాల్సిన నిబంధనలు, నింపాల్సిన పత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పోలింగ్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ, పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత చేయాల్సిన విధులను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆర్‌డిఓ డి.కీర్తి ఇతర అంశాలను వివరించారు.

రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఇరుపార్టీల అనుమతితో వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీ చేసి శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలో న్యాయ మూర్తులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు,ఎగ్జిక్యూషన్ పిటిషన్, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాల కేసులను ఇరు పార్టీల అనుమతితో రాజీ చేయాలన్నారు అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి దేవీ రత్నకుమారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, ఎక్సైజ్ న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

జిబిఎస్ పట్ల ఆందోళన వద్దు

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. ఇది అంత ప్రమాదకరం కాదని తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో పలు పిహెచ్‌సిల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జిబిఎస్ సోకితే ఒళ్లంత తిమ్మిర్లుగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరంతోపాటు వాంతులు అవుతాయని, కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా, వైరస్ ల ద్వారా సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుందని అన్నారు. దీంతో రోగి పక్షవాతం బారిన పడతాడన్నారు. దీని గూర్చి ఎక్కువగా ఆందోళన చెందవలసిన అవసరము లేదని, ఇటువంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అంతకుముందు మాతాశిశు సేవలు, వ్యాధి నిరోధక సేవలపై సమీక్షించారు. సమావేశంలో ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా టీకా అధికారి డాక్టర్‌ఆర్.అచ్చుతకుమారి, టిబి నివారణాధికారి డాక్టర్ కె.రాణి, ఎన్‌సిడి పిఒ, బివివి సుబ్రహ్మణ్యం, డెమా చిన్నతల్లి, జిల్లా మలేరియా అధికారి మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగ సమస్యల పరిష్కారానికి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నికరంగా, నిజాయితీగా పోరాడే పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని ఎమ్మెల్సీ గా గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ, పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కారణంగా 32వేల ఉపాధ్యాయ పోస్టులు, 12,247 పాఠశాలలు తగ్గిపోయాయని తెలిపారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. భవిష్యత్ విద్యా రంగంపై ప్రభుత్వ తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. గిరిజన యూనివర్సిటీ గురించి ప్రస్తావన లేదని, దాని అభివృద్ధికి చర్యలు లేవని అన్నారు. మరో వైపు ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు లేవని, వారి హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులకు సామాజికభద్రత అవసరమన్నారు. అందుకోసం పిడిఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థులు 18 ఏళ్ల కాలంలో 14 మంది మన రాష్ట్రం నుంచి ఎన్నిక కావడం దేశ చరిత్రలో నిలిచిపోయే విషయమన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల సహకారంతో పోటీ చేస్తారని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇండిపెండెంట్‌గా ఉంటారు తప్ప ఏ రాజకీయ పార్టీలకూ వత్తాసు పలకడం, పార్టీలు మారిపోవడం జరగదని తెలిపారు. ఎవరైతే ప్రజలు గెలిపిస్తారో వారి ప్రతినిధిగా మాత్రమే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో ఉంటారన్నారు. గత 12 ఏళ్లలో విద్యారంగంలో ఉపాధ్యాయ సమస్యలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారం అయ్యాయంటే శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి ఫలితమేనని గుర్తు చేశారు. అటువంటి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా 40 ఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో, ప్రజా సంఘాల పోరాటంలో ఉండి ప్రజా ఉద్యమాలతో మమేకమైన విజయగౌరిని గెలిపించు కోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని అన్నారు. విలువలకు, మంచికి, మానవత్వానికి నిలువటద్దంగా నిలిచే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జి. నిర్మల, సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, మురళీధర్, సత్యనారాయణ యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయాగౌరీ ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.



ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న విఠపు బాల సుబ్రమణ్యం, యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు

సంతృప్తి చెందేలా వినతుల పరిష్కారం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్థిక పరమైన అంశాలు, కోర్టులనుండి నిలిపివేయమని ఆదేశాలు వచ్చిన అంశాలు తప్ప మిగిలిన అన్ని రకాల వినతులకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వచ్చిన వినతులను కూలంకుషంగా చదివి, పిటిషనర్లతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అర్జీదారుల సంతృప్తే ముఖ్యమని భావించి సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అధికారుల తో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, సిఎంఒ, విఐపి గ్రీవెన్స్‌ల్లో నాలుగు రకాల వినతులు అందుతున్నాయని చెప్పారు. వీటిపై నిర్వహించిన విశ్లేషణలో సరాసరిగా ఒక్కో కుటుంబం నుంచి రెండు వినతులు వస్తున్నట్లుగా తేలిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని, ఏ ఒక్క వినతి అయినా గడువు దాటితే సంబంధిత అధికారికి ఛార్జిమెమో ఇస్తామని తెలిపారు. నియోజకవర్గవారీగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, రేపటిలోగా నివేదికలు ఇవ్వాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. ఈనెల 27న జరిగే ఎంఎల్‌సి ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల తర్వాత నిర్వహించాల్సిన ప్రక్రియపై ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలని తాహసీల్దార్లకు సూచించారు. జెసి సేతు మాధవన్ మాట్లాడుతూ, వచ్చిన వినతులకు సరైన పరిష్కారం చూపిస్తే, రీఓపెన్ కేసుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. రీఓపెన్ కేసులపై మండలాల వారీగా సమీక్షించి, కారణాలను తెలుసుకున్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు, డిప్యూటీ కలెక్టర్లు, తాహశీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బాలల సమగ్ర ఆరోగ్య పథకం పిల్లల పాలిట వరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలల సమగ్ర ఆరోగ్య పథకం పిల్లల పాలిట వరంగా పరిణమిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని సచివాలయాల పరిధిలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు ప్రభుత్వ పాఠశాలలకు, ఇంటింటికీ వెళ్లి అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ల వయసు గల పిల్లలను గుర్తించడంతోపాటు వారి ఆరోగ్య వివరాలను సేకరించి, అవసరమైన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ద్వారా పిల్లలలో రక్తహీనత, కంటిచూపు వంటి సమస్యలను తెలుసుకుని మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు.

ఆర్‌ఇసిఎస్‌ను పునరుద్ధరించండి

లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి



లోకేష్‌ను కలిసిన కళా వెంకటరావు

చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. మంగళవారం అమరావతిలోనిమ సచివాలయంలో లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులతో పాటు సమస్యలపై చర్చించారు. ప్రధానంగా చీపురుపల్లిలో గల ఆర్‌ఇసిఎస్ పునరుద్ధరణ చేయాలని,చీపురుపల్లి ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కళా వెంకటరావు కోరారు. నియోజకవర్గంలో పలు రోడ్ల మరమ్మత్తులు, కొత్తగా రోడ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్, గరివిడిలో పశు వైద్యశాలలో సమస్యలు వంటి వాటిపై చర్చించారు. తోటపల్లి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి అందజేశారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనధికార, అనుమతులు లేని నిర్మాణాలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన భాగంగా 23 వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. చిన్న వీధిలో కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం పట్ల మందలించారు. తక్షణమే ఆక్రమిత నిర్మాణాలను తొలగించి వేసి కాలువపై పలుకులు వేయాలని సిబ్బందికి ఆదేశించారు. కాలువల్లో చెత్తాచెదరాలను గమనించి తక్షణమే పూడికలను తొలగించి వేయాలని సూచించారు. రహదారులపై భవన వ్యర్థాలను ఉండడాన్ని గమనించి తక్షణమే సదరు వ్యక్తికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, ప్రజారోగ్య పర్యవేక్షకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలి : సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్కాస్‌ను రద్దుచేస్తూ ఎపి క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకొని వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆప్కోస్‌ను రద్దు చేస్తూ క్యాబినెట్ చేసిన నిర్ణయం వల్ల రాష్ట్రంలో లక్షలాదిమంది ఔట్ సోర్సింగ్ కార్మికుల పరిస్థితి పెనం లోంచి పొయ్యి మీదు పడినట్లు అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మంచి ప్రభుత్వం అయితే మొత్తం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అంతేగాని థర్డ్ పార్టీ విధానంలో కార్మికుల్ని బందీలను చేసి వారి శ్రమను కొల్లగొట్టాలని చూస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికీ అనేక రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడం లేదని, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ , తదితర చట్టబద్ధమైన హక్కులు అమలు కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు అండగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా దుర్మార్గమైన వైఖరి తీసుకుంటుందని, రిటైర్ అయిన వారిని నిర్దాక్షిణంగా ఇంటికి పంపించి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. చివరికి వాటర్ సప్లై, నైట్ శానిటేషన్, స్ట్రీట్ లైట్‌విభాగాల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా పిఎఫ్, ఇఎస్ఐ కట్టకుండా, నచ్చినట్లు విధుల నుంచి తొలగించి ఇబ్బందులు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన అందులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యలపై కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఆందోళన సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి.రమణ, నాయకులు పాపారావు, భాస్కరరావు, గురుమూర్తి,, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

బొబ్బిలి : కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు కోసం ఏర్పాటు చేసిన ఆప్కోస్‌నురద్దు చేసి కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద మంగళవారం మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిందని, కానీ మొన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రైవేటు ఏజెన్సీలకి మున్సిపల్ పారిశుధ్య పనులను అప్పజెప్పాలని నిర్ణయంచడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. మార్చి 1న కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా, మార్చి 5న చలో విజయవాడ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి.గౌరీ, కార్యదర్శి జె. రామారావు, యుగంధర్, జి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఎస్‌పి

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రయాణికులంతా రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం కోట జంక్షన్ వద్ద చేపట్టిన ర్యాలీని ఎస్‌పి ప్రారంభించారు. అక్కడి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రహదారి భద్రత ప్రమాణాలు పాటించకుంటే ప్రమాదాలు జరుగుతాయన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. చాలా వరకు వాహనదారులు తమకు డ్రైవింగు చక్కగా వచ్చునని, తనకు ప్రమాదాలు జరగవన్న భావనతో ఉంటారన్నారు. హెల్మెట్ ధరించని కారణంగా ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలై, ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారులు చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నుండి బయటపడమ వచ్చునన్నారు. మైనర్లు ఎక్కువగా డ్రైవింగు చేసి, ప్రమాదాలకు గురవ్వడం లేదా ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ప్రతీ ఏడాది మన జిల్లాలో రహదారి ప్రమాదాల కారణంగా సుమారు 400మంది మరణిస్తుండగా, మరో 900 మంది గాయపడు తున్నారన్నారు. వాహనాలను నడపడంలో నిర్లక్ష్యం కారణంగా ఏ తప్పూ చేయని ఇతర వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురై, దురదష్టవసాత్తు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రోటరీ క్లబ్ గవర్నరు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వాహనాలను నడిపేటప్పుడు తప్పని సరిగా రహదారి భద్రత ప్రమాణాలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని ప్రజలను కోరారు.అనంతరం, ర్యాలీలో పాల్గొన్న యువతీ, యువకులు, ప్రజలతో భద్రత ప్రమాణాలు పాటిస్తామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో రోటరీ గవర్నరు డా.ఎం.వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ వినోద్, డాక్టర్ పద్మకుమారి, సూర్యలక్ష్మి, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ఎవి లీలారావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం

ప్రజాశక్తి- మెంటాడ

జర్నలిస్టులపై దాడులు అమానుషమని, మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడికి పాల్పడిన మక్కువ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని మండల జర్నలిస్టుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాలు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు మాట్లాడుతూ పత్రికా స్వేచ్చను హరించడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థను నేలరాసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. దాడికి పాల్పడిన వేణుగోపాల్‌నాయుడుపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, మండల జర్నలిస్టుల సంఘ నాయకులు సిహెచ్ శివ కేశవనాయుడు, కెంగువ ఈశ్వరరావు, కొరిపిల్లి శ్రీనివాసరావు, ఏ సత్యనారాయణ, యు సత్యం, ఎం రామకృష్ణ, లక్ష్మణరావు, బిజెపి జిల్లా కార్యదర్శి నాళం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మెంటాడ: తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న జర్నలిస్టులు, నాయకులు

రామభద్రపురం: మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై అక్కడ టిడిపి మండల అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు దౌర్జన్యం చేసి చేయి చేసుకోవడం అమానుషమని మండల విలేకర్లు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ సులోచనారాణికి ప్రజాశక్తి రిపోర్టర్ సత్యారావు పట్నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో పార్టీలకు అతీతంగా ప్రజల పక్షాన న్యాయం కోసం పనిచేస్తున్న విలేకరులపై భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. టిడిపి నాయకునిపై చర్యలు తీసుకుని బాధిత రామారావు కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి, సాక్షి, సూర్య విలేకర్లు వెంకటరావు, నారాయణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన ఆ మండల టిడిపి నాయకునిపై తగు చర్యలు తీసుకోవాలని, విలేకరిపై దాడికి నిరసనగా మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్లు ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ అజు రఫీజన్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు పాల్గొన్నారు.

14న జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేద్దామని ఆ పార్టీ కార్యకర్తలకు నాయకులు అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. మంగళవారం బాలాజీనగర్ లోని జనసేన కార్యాలయంలో విజయనగరం నియోజకవర్గం నగర కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరంలో పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. మార్చి 14న పిఠాపురంలో జరిగే జనసేన అవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కోసం గత పదేళ్లుగా కష్టపడిన వారికి గుర్తింపునిస్తూ, పార్టీని మరింత శక్తి వంతంగా తీర్చిదిద్దే విధంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో విజయనగరం పట్టణ జనసేన నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, ఎర్నాగుల చక్రవర్తి, పతివాడ చంద్రశేఖర్, హుస్సేన్ ఖాన్, శివ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి : ఎపిడి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఉపాధి హామీ ఎపిడి కె.రమామణి అన్నారు. మంగళవారం యం.భూర్జివలస గ్రామంలో కాటిల్ షెడ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న గోకులాలు, కాటిల్ షెడ్, చేపల చెరువులు, కిచెన్ గార్డెన్, కూలీలకు రూ.300 కూలి వచ్చేటట్లు, అందరికి పని కల్పించేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, ఎపిఒ లక్ష్మీపతిరాజు, టెక్నీకల్ అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పనే ధ్యేయం

రామభద్రపురం: ఉపాధి హామి పథకంలో ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నామని ఆ పథకం ఎపిడి రామామణి తెలిపారు. మండల ఉపాధిహామీ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంజూరైన గోకులాలు, నిర్మాణాలు పూర్తయిన వాటి వివరాలు ఇంకా మిగిలిన వాటిని ఎప్పటిలోగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూలీ గిట్టుబాటు అయ్యేలా రెండుపూటలా పనులు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఒ త్రినాధరావు, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

వేపాడ: మండలంలోని వీలుపర్తి, చామలాదేవి అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఎండ దెబ్బలకు గురి కాకుండా ముందుగా వచ్చి కొలతలు ప్రకారం పనిచేసుకుని జాగ్రత్త పడాలన్నారు. అనంతరం ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న గోకుల షెడ్లను ఆయన పరిశీలించారు. షెడ్లు నిర్మాణ పనుల్లో ఏ విధమైన లోపాలూ లేకుండా నిర్మించుకోవాలని, అవకతవకలు జరిగినట్లు గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తే బిల్లులు చెల్లించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఎపిఒ ఆదిలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎపిడి రమామణి

ఉపాధి వేతనదార్లు అప్రమత్తంగా ఉండాలి

నెల్లిమర్ల: ఉపాధి హామీ పథకం వేతన దార్లు అప్రమత్తంగా ఉండి ఉపాధి చట్టాన్ని రక్షించు కోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన సీతారామునిపేటలో ఉపాధి పనులను పరిశీలించి వేతన దార్లతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి రంగానికి నిధులు కేటాయించలేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించుకుంటూ వస్తుందని దీనిలో భాగంగా జాబ్ కార్డులు తొలగించి వేతన దార్లను తగ్గించే కుట్ర చేస్తుందని అన్నారు. కాగా యుపిఎ హయాంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో వామపక్షల ఒత్తిడితో ఉపాధి హామీ చట్టంచేసిందని గుర్తు చేశారు. జాబ్ కార్డు కలిగిన వారికి 100రోజులు పనికల్పించినప్పటికీ మిగతా రోజుల్లో వేతన దార్లు పనిలేకుండా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి 200 రోజులు పని కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధి చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టి ఉపాధి చట్టాన్ని రక్షించుకువాలని పిలుపునిచ్చారు.



కూలీలతో మాట్లాడుతున్న రామారావు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా రైతులు జనరేట్ చేసుకోవాలని ఎఒ ఆర్.స్వాతికుమారి తెలిపారు. మంగళవారం కల్లేపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు రైతు సేవ కేంద్రాల్లో గుర్తింపు కార్డు పొందే విధంగా ఉండాలని ఒక రైతుకు ఎన్ని చోట్ల భూములు ఉన్నా ఒకే గుర్తింపు కార్డు జనరేట్ అవుతుందని తెలిపారు. ఈ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ప్రతి ఒక్కరికి ఉండాలని ఆమె సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అన్నిటికీ ఇది ఉపయోగపడుతుందన్నారు. ఉద్యానవన శాఖ అధికారి పద్మ మాట్లాడుతూ మామిడిలో సస్య రక్షణ చర్యలు గురించి ఆయిల్ పామ్ వేసుకునే రైతులకు 100 శాతం మీద మొక్కలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వంగర: ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ తట్టికోట కన్నబాబు అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివ్వాం, మద్దివలస గ్రామాలలో ఆయన మంగళవారం పర్యటించి రైతులతో మాట్లాడి సూచనలు చేశారు. రైతులు ఆధార్ కార్డు, వన్‌బి మొబైల్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది నవీన్, మురళి రైతులు పాల్గొన్నారు.



గజపతినగరం : రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురంలో పొలం పిలుస్తోంది

గజపతినగరం: మండలంలోని శ్రీరంగరాజపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ బాబు, గజపతినగరం సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె.మహారాజన్, ఎఒ ధనలక్ష్మి పాల్గొని రైతులకు సూచనలు చేశారు. మొక్కజొన్న పంట మీద ఎరువుల, పురుగు మందుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల ఖర్చు పెరుగుతుందన్నారు. చోడి పంట వేసుకొని ఆదాయం, ఆరోగ్యం పెంచుకోవాలని తెలిపారు. ప్రతీ రైతు భూ ఆధార్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎపిఎంఐపి పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామునాయుడు, రైతులు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం కలిగించొద్దు

విజయనగరం టౌన్: ప్రధాన రహదారులను ఆక్రమించి తోపుడుబళ్ళపై వ్యాపారాలను చేపట్టి ప్రజలకు, ప్రజా రవాణాకు అసౌకర్యం కల్పించ రాదని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. గంటస్తంభం, న్యూపూర్ణ జంక్షన్, ప్రకాశంపార్క్ తదితర ప్రధాన రహదారుల్లో తోపుడుబండ్లపై వ్యాపారాలు చేపట్టడంతో ట్రాఫిక్‌నకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిని గమనించిన కమిషనర్ తోపుడుబళ్ళ వ్యాపారులతో సమాలోచనలు జరిపి క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో కొంతమంది తోపుడుబళ్ళ వ్యాపారులకు అవకాశం ఇవ్వాలని కమిషనర్ ఛాంబర్‌కు వచ్చి ఆయనను కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎట్టి చర్యలనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. క్రమబద్ధీకరణగా ప్రజా రవాణాకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా తోపుడుబళ్ళ పై వ్యాపారాలు చేసుకోవాలని అన్నారు.

సీతంలో మహిళా దినోత్సవ వేడుకలు

విజయనగరం: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా అధ్యాపకులకు ట్రెజర్ హంట్ ఆటను నిర్వహించారు. ఈ ఆటలో మహిళా అధ్యాపకులను మదర్ తెరిస్సా, కల్పనా చావ్లా, సరోజినీ నాయుడు, ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరాగాంధీ అనే ఐదు జట్టులుగా విభజించారు. ఎంతో ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఆటలో మదర్ తెరిస్సా జట్టు సభ్యులు విజయం సాధించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు విజయం సాధించిన మదర్ తెరిస్సా జట్టు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు సాగాలని, ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యాసన స్థాయి బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి - వంగర

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యాసన స్థాయిని బలోపేతం చేయడమే శిక్షణ లక్ష్యమని ఎంఇఒ కె.జగదీశ్వరి అన్నారు. మండలంలో ఆరు రోజులు పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు జరగనున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండపల్లి: అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు నిర్వహించనున్న జ్ఞాన జ్యోతి మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఇఒ శోభారాణి ప్రారంభించారు. ఎంఇఒ-2 అల్లు వెంకటరమణ, హెచ్‌ఎం బండి ఉమామహేశ్వరరావు, ఆర్‌పిలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం ఎంఇఒ త్రినాథ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిడిఒ ఆర్.రాంబాబు, ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 18, 19, 20,22 తారీకు నుంచి 25వ తారీకు వరకు నిర్వహిస్తామన్నారు.

నెల్లిమర్ల: అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ పై శిక్షణ కార్యక్రమం మంగళవారం జరజాపు పేట జడ్ పి ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ పీడీ రుక్షాణ బేగం, నెల్లిమర్ల సిడిపిఒ ప్రసన్న ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్‌కుమార్ వ్యవహరించారు. ఐసిడిఎస్, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా చనమల్లుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.రాజేష్, జరజాపు పేట ఎస్‌సి కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్. వాసుదేవాచారి, సూపర్ వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అంగన్వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ కోర్స్‌పై మంగళశారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను ఎంఇఒలు నాగభూషణ రావు, పి.బాలభాస్కరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ ఎంవి ప్రసాద్ రావు, బి.ఎరకయ్యలు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్లుగా ఏనుగుతల కిషోర్, మజ్జి ఉపేంద్ర, వన్నలి శ్యాంసుందర్, అంగన్వాడి సూపర్వైజర్లు వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వావిలపల్లి లక్ష్మణరావు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కేంబూరు శ్రీనివాసరావు, సిఆర్‌ఎంటిలు కేంబూరు వెంకటరమణ, కలగాటి మోహన్, గులివిందల కృష్ణ, ఐఇఆర్పి రాజేష్ ఎల్‌డిఎ అప్పలనాయుడు, పాల్గొన్నారు.

పల్లె పండగ పనుల అడ్డగింత

భోగాపురం: పల్లెపండగలో భాగంగా జనసేన నాయకులు చేస్తున్న సిమెంట్ రహదారి పనులను టిడిపి నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. మండలంలోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామంలో పల్లె పండగ పనుల్లో భాగంగా సిమెంట్ రహదారి మంజూరైంది. దీనిలో భాగంగా జనసేన నాయకులు ఈ రహదారి పనులను ప్రారంభించారు. తమకు గాని గ్రామంలో పెద్దలకు గాని చెప్పకుండా ఎలా ప్రారంభిస్తారంటూ టిడిపి నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు అప్పల రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో గ్రామంలో వేసిన కంకర రోడ్డులకు ఇంతవరకు తమకు బిల్లులు కాలేదని తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవి గెలుపునకు తామెంతో కష్టపడ్డామని కానీ గ్రామంలో రోడ్డ విషయానికి వచ్చేటప్పటికి కనీసం మాట మాత్రం చెప్పకుండా జనసేన పార్టీ నాయకులతో రోడ్డు వేసుకోవడం దారుణమని అన్నారు. అనంతరం టిడిపి నాయకులు నీలాపు అప్పలసూరి, కొంగరాని రమణ తదితరులు పాల్గొన్నారు.

జిబిఎస్‌పై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: నూతన సిండ్రోంగా అవతరిస్తున్న బులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి శిరీష సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకి మనిషికి కండరాలు పట్టేసి పక్షవాతం వచ్చే అవకాశం ఉంటున్నారు. ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కూల్ డ్రింక్స్ తాగడం నిరోధించాలని, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి వాటిని సేవించాలన్నారు. శరీరక పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సచివాలయాలు సందర్శన

రాజాం: మండలంలోని పెనుబాక, కంచరం సచివాలయాలను ఎంపిడిఒ శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. పలు రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్దిదారులకు పథకాలను అందజేయాలని తెలియజేశారు. సచివాలయం పరిధిలో పెండింగ్ ఉన్న ఎమ్ఎస్ఎంఇ సర్వే, హౌస్ హోల్డింగ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజెన్ డేటా ఎంట్రీ, పిఎస్ఎస్ ఇకెవైసి, చైల్డ్ ఆధార్ నమోదుపై రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడింగ్, రవాణా ఛార్జీలు ఇవ్వాలి

బొబ్బిలి: 2021-22 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన రైతులకు లోడింగ్, రవాణా ఛార్జీలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ధాన్యం లోడింగ్, రవాణా ఛార్జీలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ సహకార సొసైటీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సొంత ఖర్చులతో ధాన్యం తెస్తే ప్రభుత్వమే రైతులకు లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లిస్తామని చెప్పడంతో రైతులు సొంత ఖర్చులతో ధాన్యాన్ని పంపించారన్నారు. ప్రభుత్వం లోడింగ్, రవాణా ఛార్జీలను సొసైటీలకు జమ చేసినప్పటికీ రైతులకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం కలుగజేసుకుని రైతులకు లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు ప్రసాద్, త్రినాధ్, శంభు, తదితరులు పాల్గొన్నారు.

విజయ గౌరిని గెలిపించుకోవాలి

వేపాడ: ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా, యుటిఎఫ్, ప్రజాసంఘాల మద్దతుతో పోటీచేస్తున్న కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకోవాలని సిఐటియు నాయకులు చల్లా జగన్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఐ.జగదీశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఓటర్లను సోంపురం, వేపాడ ఉన్నత పాఠశాలలను, దబ్బిరాజుపేట, భద్రవాసిపాలెం, వీలుపర్తి, నీలకంఠరాజపురం, బానాది, పాటూరు, బొద్దాం, వీరనారాయణం గ్రామాల్లో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న మొత్తం ఓటర్లను పాఠశాలల్లోను, ఉదయం సాయిత్రం ఇంటివద్ద కలుస్తున్నా మన్నారు. నిత్యం సమస్యలపై పోరాడే విజయగౌరిని గెలిపించాలని కోరారు.

టిబి నివారణపై అవగాహన సదస్సు

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద రోజులు టిబి రోగ నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో టిబి వ్యాధి లక్షణాలు, నివారణకు సూచనలు చేశారు.అనంతరం విదార్థులు మానహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ సూర్యనారాయణ పరిశీలించారు. ఐసిడిఎస్ పిఒ, సూపర్వైజర్లు, అంగనవాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు శ్రీను వెంకటరావు, శంకర్రావు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

బొబ్బిలిరూరల్: మండల పరిషత్‌లో నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ఇంచార్జ్ సిఇఒ ఆర్.వెంకటరామన్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ రోడ్లు, సచివాలయాల పని తీరు, హౌస్ టెక్స్, పారిశుధ్యం, తదితర పనుల ప్రగతిపై ఎంపిడిఒ రవి కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఎల్‌డిఎ కార్యాలయ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కిరణ్ కుమార్, పిఆర్ డిఇ అప్పారావు, ఎఒ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ కూరగాయలతో ఆరోగ్యం

వంగర: రసాయన ఎరువులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో పెంచిన ఆకుకూరలు, కాయగూరలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని సేంద్రియ వ్యవసాయ సిబ్బంది ఆర్నెపల్లి సింహాద్రినాయుడు అన్నారు. రసాయన ఎరువులు వాడకుండా పెంచిన తోటకూర, గోంగూర, చుక్కకూర, వంకాయలతోపాటు వివిధ రకాల కూరలను స్థానిక మండల పరిషత్ వద్దకు తెచ్చి వాటిని మహిళలకు చూపించి వాటి వల్ల కలిగే లాభాలు గూర్చి వివరించి అవగాహన కల్పించారు.

పాఠశాలకు మెటీరియల్ వితరణ

మెరక ముడిదాం: మండలంలోని కొత్తకర్ర ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్ బాలమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.20వేలు విలువ చేసే మెటీరియల్‌ను ఆ ఫౌండేషన్‌కు సంబంధించిన బి. రామరాజు మంగళవారం అందించారు. గ్రీన్‌చాక్ బోర్డ్స్, ఫర్నీచర్, పెన్లు, పిక్చర్‌ఛార్ట్స్ మొదలగు సామాగ్రిని ఎంఇఒ ఎం. చంద్రశేఖర్ చేతులు మీదుగా ఫౌండేషన్ ప్రతినిధి, సిఆర్‌ఎంటి రెడ్డి శంకరరావుతో కలసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివివిఎల్ నరసింహులుకు అందించారు.

మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

శృంగవరపు కోట: ఈనెల 26వ తేదీ నుండి జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని సన్యాసయ్య పాలెం, ఎస్‌కోట పట్టణం, పుణ్యగిరికి వెళ్లే రహదారి తదితర ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టిని, తుప్పలను తొలగించారు. శివరాత్రి ఉత్సవాలలో రోడ్డు మార్జిన్ దాటి రోడ్డుపైకి దుకాణదారులు రాకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. పంచాయతీ అభివృద్ధి అధికారి అనురాధ పుణ్యగిరికి వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలను తొలగించి అవసరమైన చోట రోడ్లకు మరమ్మత్తులు చేయించారు. మండలంలోని ధర్మవరం వద్ద గల సన్యాసేస్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిని, గుడి పరిసర ప్రాంతాలను ధర్మవరం పంచాయతీ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ శుభ్రం చేయించారు.

ప్రతి ఒక్కరూ హోమ్ కంపోస్టు తయారు చేయాలి

రాజాం: మహిళలు ప్రతి ఒక్కరూ ఇంట్లో హోమ్ కోమ్‌పోస్టును తయారు చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు సూచించారు. పెనుబాకలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు ఎసి చిరంజీవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హోమ్ కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్స్‌పై అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న సభ్యులను ఐహెచ్‌హెచ్‌సిపి యాప్‌లో విఒఎలు నమోదు చేయాలన్నారు. ఇంటి వద్ద గుంతను తవ్వి ఈ గుంతలో మన వంటింటి నుండి వచ్చే కూరగాయలు తొక్కలు, ఎండిన ఆకులు, ఆవు పేడను ఉపయోగించి కుళ్ళించి సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలన్నారు. ఇది భూసారాన్ని పెంచి, పంటలకు మొక్కలకు మేలు చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఒ ఎపిఎం హేమలత పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్ల పార్వతమ్మ జాతరలో అన్నదాన కార్యక్రమానికి జనసేన నేతలు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం ఉప సర్పంచ్ బాల అప్పలరాజు లక్ష రూపాయలు జాతర నిర్వాహకులకు మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే జాతరలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు జాతరకు వచ్చే వారికి అన్నదానం నిమిత్తం ఈ మొత్తం అందజేసినట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

చెల్లని పది రూపాయిల కోసం గొడవ

ఒక వ్యక్తికి విరిగిన నడుము

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట పంచాయతీ సీతంపేట పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం సాయంత్రం చెల్లని పదిరూపాయిలు నోటు విషయంపై జరిగిన చిన్నపాటి గొడవ ఒక వ్యక్తి నడుం విరిగేలా చేసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన నౌదాసరి ఈశ్వరరావు ఒక చెప్పుల దుకాణం నడుపుతున్నాడు. ఎస్.కోట నుంచి ధర్మవరం వెళ్తు మార్గం మధ్యంలో సీతంపేట పెట్రోల్ బంక్ వద్ద తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ కొట్టించుకునేందుకు వెళ్లి పెట్రోలి పోయించుకున్నాడు. అనంతరం పెట్రోల్ పోసిన వ్యక్తికి డబ్బులు ఇవ్వడంతో అందులో ఒక చెల్లని పదిరూపాయిలు నోటు ఉంది. వేరే నోటు ఇవ్వాలనీ బంకులో పనిచేసే వ్యక్తి కోరాడు. ఏదోరకంగా మారిపోతుందిలే అని చెప్పడంతో ఇద్దరి మధ్య వాదన జరిగింది. ఈ సమయంలో పెట్రోలిపోసిన వ్యక్తి బండిపై వున్న ఈశ్వరరావును ఒక్క ఊపున తోయడంతో పక్కనే వున్న రెయి లింగ్ పైపుపై పడిపోయాడు. నడుం బాగంతో పాటు తొడ కిందభాగం బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యంకోసం కెజిహెచకు రిఫర్ చేశారు. క్షతగాత్రుడు బందువులు వెంటనే అక్కడికి చేరుకొని తోసేసిన వ్యక్తికి దేహశుద్ధి చేశారు. సిఐ నారాయణమూర్తి వివరణ కోరగా ఫిర్యాదు అందిందని తెలిపారు.

40 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో ఆంద్ర రిజార్వాయిర్ ప్రధాన కాలువ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆంద్ర పోలీసులు మాటు వేసి 40 లీటర్లు నాటుసారాతో నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు ఆంద్ర ఎస్ఐ కె సీతారాం తెలిపారు.

మద్యంతో వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో బెల్ట్ షాపుపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 8 మద్యం సీసాలతో వ్యాపారిని అరెస్టు చేశారు. గొల్లపల్లిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు తెలిపారు. మంగళవారం ఆయన రామతీర్థం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలు నేటి నుంచి ఏర్పాటు చేసి ఈ నెల 28 వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం సీతారామునిపేట వద్ద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

ఆదార్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

రామభద్రపురం: ఆదార్ స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం నుంచి శుక్రవారం వరకు 4 రోజులు పాటు నిర్వహిస్తున్నామని దీనిని వినియోగించుకోవాలని ఎంపిడిఒ రత్నం కోరారు. సిబ్బందితో కలిసి సోంపురం పంచాయతీలో జరుగుతున్న డ్రైవ్‌ను మంగళవారం పరిశీలించారు. సున్నా నుంచి 6 సంవత్సరాల పిల్లలంతా తప్పనిసరిగా ఆదార్‌లో నమోదు కావాలని సూచించారు. ఈ డ్రైవ్ అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం నిర్వహణ షెడ్యూల్ విడుదల చేశారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లిలో సచివాలయంలో నిర్వహించిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ కోరారు. ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గజరాయునివలసలో నిర్వహించాల్సిన కేంద్రాన్ని కోటిపల్లిలో 70మంది వరకు ఆరేళ్ల లోపు పిల్లలున్నట్లు ఐసిడిఎస్ అధికారులు చెప్పడంతో అక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి తప్పులూ లేకుండా ఆధార్ నమోదు చేయాలని సిబ్బందిక సూచించారు.

రాజాం: మండలంలోని అంతకపల్లిలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపును మంగళవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో నుండి ఆరు సంవత్సరాల పిల్లలు, బయోమెట్రిక్ అప్డేట్ కోసం ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది, నాక్లయింట్స్ విశాఖపట్నం జిల్లా, దాబా గార్డెన్స్, లలితా కోలనీ, శ్రీ వెంకటసాయి ఎన్‌క్లేవ్ డోరు నెం. 29-5-6/1 కాపురస్తులు, సి.హెచ్ (లేటు) రామారావు గారి కుమారుడు 1) సి.హెచ్. రామకృష్ణారావు, ఈతని కుమారుడు 2) సి.హెచ్. అశ్విన్‌రావు ఇచ్చిన భోగట్టా మేరకు, నాక్లయింట్స్ ఈదిగువ షెడ్యూలు ఆస్థులను విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, రావాడ గ్రామం కాపురస్తులు జీరు (లేటు) అప్పలరెడ్డి గారి భార్య 1) జీరు జయలక్ష్మి, ఈమె కుమారుడు 2) జీరు భాస్కరరెడ్డి గార్ల నుండి కొనుగోలు జేయదలంచియున్నందున సదరు ఆస్తులకు సంబంధించి ఎవరికైనా, ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల **7 దిన ములలోగా** తెలియజేయగలందులకు ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

షెడ్యూలు ఆస్తుల వివరములు

విజయనగరం జిల్లా, భోగాపురం సబురి॥ పరిధి, భోగాపురం మండలం, రావాడ గ్రామ పంచాయితీ, రావాడ గ్రామ రెవిన్యూ పరిధిలోని జిరాయితీ మెట్టు భూముల వివరాలు 1) ఒకటవ ఆసామికి వార సత్వంగా దఖలుపడిన 1వ ప్రతి ఖాతానెం. 1013, సర్వే నెం. 194-1లో ఎ.0-05సెంట్లు, సర్వే నెం. 194-2లో ఎ.0.01సెంట్లు వెరశి ఎ.0-06 సెంట్లున్ను, 2) రెండవ ఆసామికి క్రయమూలంగా దఖలుపడిన 1-బి నమూనా (ఆర్.ఓ.ఆర్) ప్రకారం 2వ ప్రతి ఖాతా నెం. 1205, సర్వే నెం. 194-2A లో ఎ.0-18½ సెంట్లు, సర్వే నెం. 194-7Bలో ఎ.0-04½ సెంట్లు వెరశి ఎ.0.23 సెంట్లుగాగల ఏక ప్రతికి హద్దులు. **తూర్పు:** జీరు రాము & జీరు జయలక్ష్మి గార్ల జి.మెట్టు, **దక్షిణం:** జీరు అమ్మా జమ్మ గారి జి.మెట్టు, **పడమర:**రాస్తా, **ఉత్తరం:** జీరు జయలక్ష్మి& జీరు శ్రీనివాసరెడ్డి గార్ల జి.మెట్టు.

P.S.K.V. SURESH, Advocate
29-35-8, Gollalapalem, Old Jail Road
Visakhapatnam. **Cell: 81790 84258**

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ బొబ్బిలి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS No. 16/2023

Between :
గండి అప్పలనాయుడు, S/o లేటు అప్పలస్వామి, వయస్సు 62 సం॥, బాడంగి గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా. .....వాది
And :
చుక్క సురేష్, S/o రాము, వయస్సు 29 సం॥లు, డొంకినవలస గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా. ......ప్రతివాది
To,
Chukka Suresh, S/o Ramu, aged 29years, Donkinavalasa Vill, Badangi Mandal, Vizianagaram Dist.

పై నెంబరు దావాను యిందలి వాది, ప్రతివాదిపై Promisory Note Amount రాబట్టే నిమిత్తం బొబ్బిలి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు దావాలో యిందలి ప్రతివాది ఎన్ని పర్యాయములు కోర్టు నోటీసు పంపించినా తీసుకోనందున, సదరు దావాను కోర్టువారు తే20-02-2025న వాయిదా వేసి యున్నారు. కావున యిందలి ప్రతివాది **తే 20-02-2025దీన ఉ॥ 10-30ని॥** కోర్టువారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని, హాజరై ఎట్టి ఆక్షేపణలు యున్న తెలియచేయగలరు. లేని యెడల పరోక్షమున తీర్మాణము చేయుదురు.

(ఈ ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రచురించుటమైనది)

కొల్లి సింహాచలం,
గుర్రాల కృష్ణ
అడ్వకేట్స్, బొబ్బిలి,
సెల్ : 9949783951

బొబ్బిలి
తేది: 19-2-2025